సాక్షి పశ్చిమగోదావరి

శనివారం । 21 । అక్టోబర్ । 2023



విజయవాడకు ప్రత్యేక బస్సులు

దసరా ఉత్సవాల సందర్భంగా విజయవాడ దుర్గమ్మ దర్శనానికి శనివారం నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు.


2లో ▸



నాణ్యంగా.. పోషకాలతో..

జిల్లాలో రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం నాణ్యమైన పోషకాలతో నిండిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది.

2లో ▸



నేడు ప్రత్యేక లోక్ అదాలత్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా కోర్టులున్న ప్రదేశాల్లో శనివారం ప్రత్యేక లోక్‌అదాలత్ నిర్వహించనున్నారు.

2లో ▸

న్యూస్‌రీల్

క్రీడల ప్రోత్సాహానికి కృషి



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

పెనుగొండ: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ఇటీవల మార్టేరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్త్రీ, పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలకు అల్పాహారం, భోజన వసతి కల్పించిన మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు శుక్రవారం తూర్పుపాలెంలో క్రీడాకారులు, క్రీడా నిర్వాహకులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లవేళలా క్రీడాకారులకు అండగా నిలుస్తామని శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ద్వారా క్రీడలను ప్రోత్సహిస్తోందన్నారు. జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కర్రి కృష్ణారెడ్డి, వైబీఏ అధ్యక్షుడు సత్తి సుబ్బన్‌రెడ్డి, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, మార్టేరు ఉప సర్పంచ్ కర్రి వేణుబాబు, పీడీలు పడాల శ్రీనివాసరెడ్డి, కర్రి వినాయకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు



రవిప్రకాష్, ఎస్పీ

సాక్షి, భీమవరం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాలు సందర్భంగా శనివారం నుంచి పదిరోజుల పాటు జిల్లాలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఎస్పీ యు.రవిప్రకాష్ తెలిపారు. శుక్రవారం భీమవరం టూటౌన్ స్టేషన్‌లో విలేకరులకు వివరాలు వెల్లడించారు. తొలిరోజు విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించుకుంటూ భీమవరం మార్కెట్ యార్డు ఆవరణలో స్మృతి కవాతు నిర్వహించి పోలీసు అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలు అందజేస్తామన్నారు. ఆయా పోలీసు స్టేషన్లలో అమరవీరుల ఫొటోలను ఏర్పాటుచేస్తామన్నారు. విద్యార్థులు, పోలీసు సిబ్బంది పిల్లలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయుధ ప్రదర్శన, ఓపెన్‌హౌస్, వైద్య, రక్తదాన శిబిరాల నిర్వహణ, పోలీసు అమరవీరుల తోబుట్టువులు, ప్రత్యేక సాధకులను గుర్తించి వారికి సన్మానాలు, మాక్ డ్రిల్ ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 31న ముగింపు సందర్భంగా ఆర్గనైజేషన్ ఆఫ్ యూనిటీ రన్, కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహిస్తామని ఎస్పీ రవిప్రకాష్ వివరించారు.

జెడ్పీ సీఈఓ బదిలీ

ఏలూరు(మెట్రో): జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి కేవీఎస్ఆర్ రవికుమార్‌ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాపరిషత్ సీఈఓగా రవికుమార్ రెండేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రవికుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి రిపోర్టు చేయాలని రాష్ట్ర పంచాయతీ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాపరిషత్ సీఈఓగా పెదపాడు ఎంపీడీఓ, ప్రస్తుత డిప్యూటీ సీఈఓ ఎస్.నిర్మలాజ్యోతికి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. త్వరలోనే రెగ్యులర్ సీఈఓ నియమితులయ్యే అవకాశం ఉంది.

ఏలూరులో శిశు గృహ భవనం ప్రారంభం

ఏలూరు(మెట్రో): ఏలూరు విద్యానగర్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశుగృహ భవనానికి నూతనంగా నిర్మించిన భవనాన్ని శుక్రవారం పూజలు చేసి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభించారు. కలెక్టర్ సతీమణి డాక్టర్ మానస, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ, సాధికారత అధికారి కె.పద్మావతి, సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.కేదారేశ్వరరావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, డీసీపీఓ సీహెచ్ సూర్యచక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్, సోషల్ వర్కర్ శ్రీకాంత్, మమత శ్రీ, కౌన్సిలర్ బాలస్వామి, అవుట్‌రీచ్ వర్కర్ భార్గవి, చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ రాజు, చైల్డ్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉద్యోగుల గ్రీవెన్స్

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఉద్యోగుల అర్జీల పరిష్కారానికి శనివారం ఉదయం 10.30 గంటల నుంచి ఏలూరు కలెక్టరేట్‌లో ఎంప్లాయీ గ్రీవెన్స్ నిర్వహించనున్నట్టు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు గ్రీవెన్స్‌లను దరఖాస్తులో పొందుపర్చి సీఎఫ్ఎంఎస్ ఐడీ, ఎంప్లాయీ గుర్తింపు నంబర్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని సూచించారు.

వీణాపాణి.. విజయరూపిణి

సరస్వతీ నమస్తుభ్యం వరదే కామరూపిణి.. విద్యారంభం కరిష్యామి సిద్ధిర్భవతు మే సదా.. స్మరణలు మార్మోగాయి. శ్రీదేవీ శరన్నవరాత్రులలో భాగంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం అమ్మవార్లు చదువుల తల్లిగా దర్శనమిచ్చారు. ఆలయాల వద్ద సామూహిక సరస్వతీదేవి పూజలు జరిగాయి.

\- సాక్షి నెట్‌వర్క్



తాడేపల్లిగూడెం రూరల్ : వీరంపాలెం క్షేత్రంలో సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు



కాళ్ల : దొడ్డనపూడిలో ధనలక్ష్మి అలంకరణ



భీమవరం (ప్రకాశంచౌక్): సోమారామంలో..



పెనుగొండ: వాసవీ శాంతి ధామ్‌లో..

జూనియర్ కాలేజీలకు మహర్దశ

నాడు-నేడుతో అభివృద్ధి

- ఉమ్మడి జిల్లాల్లో 33 కళాశాలల్లో పనులు
- రూ.12 కోట్ల నిధుల కేటాయింపు
- డిసెంబర్ నాటికి పూర్తయ్యేలా చర్యలు





చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బల్లలు (నాడు), అధునాతన బెంచీలు (నేడు)

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. నాలుగేళ్లుగా సర్కారీ బడులను ఉన్నత ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. అలాగే ఇంటర్ విద్యపైనా ప్రత్యేక దృష్టి సారించారు. విద్యారంగంలో పలు పథకాలు అమలుచేస్తూ చదువును ప్రోత్సహిస్తున్నారు. నాడు-నేడులో ప్రభుత్వ జూనియర్ కళాశాలల రూపురేఖలు మారుస్తున్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేలా చర్యలు తీసుకున్నారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరుస్తూ విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యాభ్యాసం చేసే అవకాశం కల్పిస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలను..

మనబడి-నాడు నేడు కార్యక్రమంలో తొలివిడత ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 1,200 పాఠశాలలను అభివృద్ధి చేశారు. రెండో విడతలో 1,600 పాఠశాలల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో జూనియర్ కళాశాలలనూ కూడా నాడు-నేడు పథకంలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో వీటికి మహర్దశ పట్టింది. ఈ మేరకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో తొలి విడతగా నాడు-నేడులో అభివృద్ధి పనులకు ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకూ అభివృద్ధికి నోచుకోని కళాశాలల వివరాలను సేకరించి వాటి అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

కళాశాలల రూపురేఖలు మారుస్తూ..

ఇంటర్మీడియెట్ బోర్డు అధికారుల నివేదికల ఆధారంగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎంపిక చేసిన కళాశాలల్లో నాడు-నేడు పనులు ప్రారంభమయ్యాయి. దీంతో ఆయా కళాశాల రూపురేఖలు మారుతున్నాయి. కళాశాలల్లో పాఠశాలల తరహాలోనే మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు, ప్రహరీ గోడలు, చిన్న, పెద్ద మరమ్మతులు, విద్యుదీకరణ, గ్రీన్ చాక్ బోర్డులు, విద్యార్థులకు, అధ్యాపకులకు అత్యాధునిక బెంచీలు, కుర్చీలు, తరగతి గది లోపల, వెలుపల, ప్రహరీ గోడలకు ఆకర్షణీయమైన రంగులు వేసే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

రూ.12 కోట్లకు పైగా నిధులతో..

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో నాడు-నేడు కింద అభివృద్ధి చేయడానికి 33 కళాశాలలను ఎంపిక చేశారు. వాటిలో ఏలూరు జిల్లాలో 20 కళాశాలలు ఉండగా పశ్చిమగోదావరి జిల్లాలో 13 కళాశాలలు ఉన్నాయి. ఏలూరు జిల్లాలోని కళాశాల అభివృద్ధికి రూ.9.68 కోట్లు నిధులు కేటాయించగా వాటి నుంచి ఇప్పటికే రూ.4.18 కోట్ల నిధులు విడుదల చేశారు. అలాగే పశ్చిమగోదావరి జిల్లాలో 13 కళాశాలల అభివృద్ధి నిమిత్తం రూ.2.35 కోట్ల నిధులు కేటాయించగా వాటి నుంచి రూ.2.27 కోట్ల నిధులు విడుదల చేయడం ఆ నిధులతో దాదాపు 92 శాతం పనులు పూర్తి చేయడం చకచకా జరిగిపోయాయి. మరో రెండు, మూడు రోజుల్లో మిగిలిన నిధుల విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కార్పొరేట్ హంగులతో విద్యార్థులను ఆకట్టుకోనున్నాయి.

నాడు-నేడులో అభివృద్ధి పనులు

జిల్లా	కళాశాలల	నిధుల కేటాయింపు	నిధుల మంజూరు
ఏలూరు	20	రూ.9.86 కోట్లు	రూ.4.18 కోట్లు
పశ్చిమగోదావరి	13	రూ.2.35 కోట్లు	రూ.2.27 కోట్లు

నాణ్యతలో రాజీ లేకుండా..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న నాడు-నేడు అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ లేకుండా చర్యలు చేపట్టాం. ఎప్పటికప్పుడు విడతల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నాం. పనులు మధ్యలో ఆగిపోకుండా నిరంతరం కొనసాగేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఇతర బాధ్యులకు జిల్లా కార్యాలయం నుంచి మార్గనిర్దేశం చేస్తున్నాం. వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఆయా పనుల స్థితిగతులను గురించి ఆరా తీస్తూ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేస్తున్నాం. వచ్చే డిసెంబర్ నాటికి అభివృద్ధి పనులు మొత్తం పూర్తి చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం.

\-బి.ప్రభాకరరావు, జిల్లా వృత్తి విద్య అధికారి, ఏలూరు

సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



సాగునీటి సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సాక్షి, భీమవరం: జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగునీటి ఎద్దడి తలెత్తకుండా వారాబందీ ద్వారా నీరు సరఫరా చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. సాగునీటి ఇబ్బంది లేకుండా ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి సాగునీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. ఆక్వా జోన్ పరిధిలోని ఈ-ఫిష్ నమోదు చేసుకున్న సాగుదారులకు మాత్రమే విద్యుత్ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. పదెకరాల కంటే ఎక్కువ సాగు చేస్తే సబ్సిడీ వర్తించదని, ఆక్వా అనుమతి కేవలం చెరువులను ధ్వంసం చేయకుండా ఉండటానికి మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇరిగేషన్ శాఖ ఈఈ ఎం.దక్షిణామూర్తి మాట్లాడుతూ జిల్లాలో నీటి ఎద్దడి పరిస్థితి లేనందున వారాబందీ అవసరం లేదన్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో కాలువల్లో కర్రనాచు, తూడు అడ్డుపడటం వల్ల నీటి ప్రవాహం తగ్గుతుందని, కర్రనాచు, తూడు తొలగింపునకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. జేసీ ఎస్.రామసుందర్ రెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కె.సంగీత్ మాధుర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా నీటి వనరుల అధికారి పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం సహించం

కలెక్టర్ ప్రశాంతి



జగనన్నకు చెబుదాంలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పాలకోడేరు: విధి నిర్వహణలో అలసత్వం సహించమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. పాలకోడేరు ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పాలకోడేరు పంచాయతీ కార్యదర్శి రమాలీల బిల్లులు సరిగా చేయడం లేదని సర్పంచ్ ఇంజేటి మరియమ్మ ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో కార్యదర్శులంతా ఇలాగే పనిచేస్తున్నారా అని మండిపడ్డారు. అలాగే మోగల్లు సెక్రటరీ వ్యక్తిగత ఖాతాలో నిధులు జమచేసుకుంటే ఏం చేస్తున్నారని ఎంపీడీఓ నూకల మురళి గంగాధరరావును ప్రశ్నించారు. పంచాయతీ కార్యదర్శి రమాలీలను ప్రభుత్వానికి సరెండర్ చేయాలని, మోగల్లు పంచాయతీ కార్యదర్శి కె.వెంకటరాజుపై నివేదిక పంపాలని ఆదేశించారు. ప్రతినెలా మూడో శుక్రవారం నిర్వహించే ఎంప్లాయీ గ్రీవెన్స్ ద్వారా ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

డంపింగ్ యార్డుపై చర్యలు : శృంగవృక్షంలో డంపింగ్ యార్డ్ లేక ఇబ్బందులు పడుతున్నామని స్థలం చూపించినా, హైకోర్టుకు వెళ్లినా పట్టించుకోవడం లేదని శృంగవృక్షం గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గులిపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సోము రామకృష్ణ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. గోస్తనీ పంట కాలువ ఆయకట్టు పరిధిలో చెత్తాచెదారం తూడు, గుర్రపుడెక్క పెరిగిపోయి తమ చేలకు నీరందడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఇరిగేషన్ ఏఈ, డీఈలను పిలిచి ఫిర్యాదులు ఎందుకు పట్టించుకోవడం లేదని, ఇప్పుడే వెళ్లి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు రెండు ల్యాప్‌టాప్‌లు, మూడు ఆండ్రాయిడ్ ఫోన్లు కలెక్టర్ అందజేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

అంతర్జాతీయవాది అంబేడ్కర్

శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు



అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభలో మాట్లాడుతున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: అంబేడ్కర్ అంతర్జాతీయవాది అని, ఆయన కొందరి వాడని భ్రమపడటం తగదని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. స్థానిక సమతానగర్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని మంత్రి మేరుగ నాగార్జునతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మోషేన్‌రాజు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల్ని అమలుజేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధనలో భాగంగా సీఎం జగన్ మహిళలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఇంగ్లిష్ చదువు ఆవశ్యకతను గుర్తించి పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నారని చెప్పారు. రాష్ట్రానికి ఎవరు అవసరమో, మనల్ని ఎవరు అభివృద్ధి చేస్తున్నారో గుర్తించి ఓటు వేయాలని ప్రజలను కోరారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ విద్యకు అధిక ప్రాధాన్యమిచ్చిన మహోన్నతుడు అంబేడ్కర్ అని కొనియాడారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ సమతా నగర్‌లో దళితులకు సీసీ రోడ్లు నిర్మించామని, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు అన్యం కృష్ణ, గుండా సుందరరామనాయుడు, గాలి సామ్రాజ్యం, వంగా జ్యోత్స్న, పడాల శ్రీనివాసరెడ్డి, పుప్పాల పండు, జిల్లా పెద్దిరాజు, అంబటి రమేష్, ఎస్కే.హుస్సేన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చీకటమిల్లి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

27న ఓటర్ల జాబితా ముసాయిదా విడుదల

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఓటర్ల ముసాయిదా జాబితా ఈనెల 27న వెలువడుతుందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, కొత్త ఓటింగ్ యంత్రాల పరిశీలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27న ఓటర్ల ముసాయిదా జాబితా ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందిస్తామన్నారు. వాటిని పరిశీలించి అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. అలాగే జిల్లాకు కేటాయించిన ఓటింగ్ యంత్రాల తొలిదశ తనిఖీ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరుగుతుందన్నారు. ఈనెల 16 నుంచి ప్రారంభించిన ప్రక్రియ నవంబరు 10 వరకు సాగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను సందర్శించి ఓటింగ్ యంత్రాల తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. సమావేశంలో డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, నెరుసు నెలరాజు (బీజేపీ), ఎ.రత్నాకర్ (బీఎస్పీ), ఆర్. సత్యనారాయణ (ఆమ్ ఆద్మీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఎస్‌బీ ప్రసాద్ (కాంగ్రెస్), యు. బాలానందం (టీడీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో మరిన్ని పనులు

డ్వామా పీడీ రాజేశ్వరరావు



గ్రామసభలో మాట్లాడుతున్న డ్వామా పీడీ

భీమవరం అర్బన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వేతనదారులకు ఎక్కువ పనిదినాలు కల్పించడమే లక్ష్యంగా కొత్త పనులు గుర్తించేందుకు గ్రామ సభలు నిర్వహిస్తున్నామని డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. మండలంలోని వెంపలో శుక్రవారం ఉపాధి గ్రామసభ నిర్వహించారు. పంట బోదెలు, పంట కాలువలు, చెరువులు, మొక్కలకు సంబంధించిన పనులు మాత్రమే కాకుండా ప్రభుత్వం అనుమతించిన 97 రకాల పనులు ఉన్నాయని ఇందులో 50 రకాల పనులకు పైగా జిల్లాలో చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. హార్టీకల్చర్‌లో కొబ్బరి, మామిడి, నిమ్మ, జామ, సపోటా వంటి పండ్ల తోటలకు సంబంధించి పనులకు రూ.80 వేల నుంచి రూ.2 లక్షల వరకు రైతులకు లబ్ధి చేకూర్చే అవకాశం ఉందన్నారు. జగనన్న కాలనీల్లో సోక్ పిట్ల నిర్మాణం, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ నిర్మాణం, కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద, వ్యక్తిగత మరుగు దొడ్ల వద్ద పనులకు అవకాశం ఉందని చెప్పారు. అనంతరం గ్రామంలో చేపట్టే పనులపై ప్రజలకు మ్యాపింగ్ ద్వారా వివరించారు. సర్పంచ్ ఇంజేటి రాజేశ్వరి, కార్యదర్శి జి.కృష్ణమోహన్, ఈసీకే శ్రీనివాస్, ఉపాధి హామీ పథకం టీఏ చంద్ర ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇంజిన్ల దొంగతనంపై కేసు నమోదు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇంజిన్

కుక్కునూరు: పంటచేలకు నీరందించేందుకు వాగులో ఏర్పాటు చేసిన ఇంజిన్ల దొంగతనం ఘటనలో పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కుక్కునూరు నుంచి దాచారం వెళ్లే దారిలో గుండేటి వాగులో మిరప చేలకు నీరందించేందుకు రైతులు ఇంజిన్లు ఏర్పాటు చేశారు. గత మూడు రోజుల క్రితం కొందరు వ్యక్తులు నాలుగు ఇంజిన్లు దొంగిలించి వాటిని వేలేరుపాడు మండలంలో అమ్మేశారు. బాధిత రైతులు ఇంజిన్ల గురించి వాకబు చేయగా వేలేరుపాడు మండంలో అమ్మినట్టు తెలియడంతో కొన్నవారి వద్దకు వెళ్లి వివరాలు ఆరా తీసి అనుమానితులపై కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దొంగిలించిన ఇంజిన్లను స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేడు ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రత్యేక లోక్ అదాలత్

ఏలూరు (టూటౌన్): జాతీయ, రాష్ట్రీయ న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో కోర్టులున్న అన్ని ప్రదేశాలలో ఈ నెల 21న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కెకెవి బుల్లి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో వాహన ప్రమాద బీమా కేసులు, రెవిన్యూ కేసులు కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని, అందువల్ల కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నాణ్యంగా.. పోషకాలతో

- పేదల ఆకలి తీరుస్తున్న ఉచిత బియ్యం
- జిల్లాలో 5,66,021 రేషన్ కార్డుదారులకు సరఫరా

ఆకివీడు: నిరంతరాయంగా పేదలకు నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎందరో ఆకలిని తీర్చుతుంది. ఈ కార్యక్రమం వల్ల ఎన్నో లక్షల కుటుంబాలు మూడు పూటలా భోజనం చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో రెండేళ్లపాటు ఉచితంగా బియ్యం పంపిణీ చేసిన జగన్ సర్కార్ ఈ ఏడాది జనవరి నుంచి బియ్యాన్ని ఉచితంగా సరఫరా చేస్తుంది. ప్రభుత్వానికి ఎంతో భారమైనప్పటికీ, ఏడాది పాటు బియ్యం ఉచితంగా మంజూరు చేయాలని నిర్ణయించింది. పౌర సరఫరాల శాఖ ద్వారా ఆయా చౌక డిపోల నుంచి రేషన్ వాహనాలు ఇంటింటికీ వెళ్లి.. వినియోగదారులకు నేరుగా బియ్యం సరఫరా చేస్తున్నారు. కరోనా కష్టకాలంలో రెండేళ్ల పాటు ఉచిత బియ్యం అందజేశారు. ఆ తరువాత నాలుగైదు నెలలు రూపాయి బియ్యం అమ్మినప్పటికీ, గతేడాది నుంచి ఉచిత బియ్యం అందుతూనే ఉంది. జిల్లాలో అంత్యోదయ కార్డుదారులు 31,954 మంది ఉండగా.. తెల్ల రేషన్ కార్డులు 5,34,067తో కలిపి మొత్తం 5,66,021 రేషన్‌కార్డులున్నాయి. 15,86,905 మందికి 8,590 మెట్రిక్ టన్నుల ఉచిత బియ్యం సరఫరా చేస్తున్నారు. కిలో బియ్యం ప్రభుత్వం రూపాయికి ఇస్తున్నప్పటికీ మార్కెట్‌లో కిలో రూ. 20 నుండి రూ.26 వరకూ ఉంది.

నాణ్యమైన బియ్యం సరఫరా

గత ప్రభుత్వాలు పేదలకు పురుగు పట్టిన, నూక శాతం అధికంగా ఉన్న, దుమ్ముధూళితో కూడిన బియ్యం సరఫరా చేసేవారు. భారత ఆహార సంస్థ గోదాముల్లో ముక్కిపోయిన బియ్యం రేషన్ షాపుల ద్వారా విక్రయించేవారు. సముద్రంలో పారబోసే బియ్యంను పేదలకు అమ్మేవారు. ఆ దుస్థితి పేదలకు రాకూడదని నాణ్యమైన బియ్యం ఉచితంగా అందజేస్తున్నారు. తప్ప, తాలు, ఊక, మట్టి, రాళ్లు వంటివి రాకుండా సార్టెక్స్ మిషన్‌ను అన్ని రైస్‌మిల్లుల్లో ఏర్పాటు చేయించారు.

ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీ

బియ్యంలో పోష్టికాలు అంతంత మాత్రంగానే ఉండడంతో పోషకవిలువలు ఉండే బియ్యం(ఫోర్టిఫైడ్) రేషన్ బియ్యంలో కలిపి వినియోగదారులకు సరఫరా చేస్తున్నారు. దీంతో రేషన్ బియ్యంలో పోషకాలు పెరిగేలా చూస్తున్నారు. బియ్యం నీటిలో వేసి కడుగుతున్న సమయంలో పైకి తేలుతున్న గింజలు పాడైపోయాయని భావించకుండా వాటిని వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు.



రేషన్ సరఫరా చేస్తున్న దృశ్యం.

కడుపు నింపుతున్న ఉచిత బియ్యం



ఉచిత బియ్యం కడుపు నింపుతుంది. మంచి బియ్యం ఇస్తున్నారు. నాణ్యమైన బియ్యం ఇస్తానని చెప్పిన జగన్ మాట తప్పకుండా బియ్యం ఇస్తున్నారు. ఎంతో ఆనందంగా ఉంది.

– అల్లాడి వెంకటేశ్వరరావు, వ్యవసాయ కూలి, కుప్పనపూడి, ఆకివీడు మండలం

ఎంతో ఆనందంగా ఉంది



మాకు ఉచిత బియ్యం ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉంది. ఉచిత బియ్యంలో పోషకాలు కలిపి ఇవ్వడం మంచి పని. గతంలో రేషన్ బియ్యం తింటే కడుపు నొప్పి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. మంచి బియ్యం పంపిణీ చేస్తున్న జగన్‌కు ధన్యవాదాలు.

– సలాడి మణికంఠ, చిరువ్యాపారి, చెరుకుమిల్లి, ఆకివీడు మండలం

ఏడాది పాటు ఉచితంగా పంపిణీ



తెల్లరేషన్ కార్డుదారులకు, అంత్యోదయ కార్డుదారులకు ఉచితంగా రేషన్ బియ్యం ప్రభుత్వం సరఫరా చేస్తుంది. గత ఏడాది జనవరి నుంచి ఇస్తున్న ఉచిత బియ్యం ఈ ఏడాది కూడా పొడిగించారు. జిల్లాలో 5,66,021 కార్డుదారులకు ఉచిత బియ్యం గత ఏడు నెలలుగా అందజేస్తున్నాం.

– రవి శంకర్, సివిల్ సప్లయిస్ అధికారి, భీమవరం

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు



ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరిన నరసన్నపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్తలు

కైకలూరు: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి ఆకర్షితులై కైకలూరు నియోజకవర్గంలో భారీగా టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి కార్యకర్తలు, నాయకులు చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరులో ఎమ్మెల్యే డీఎన్నార్ స్వగృహం వద్ద ముదినేపల్లి మండలం నరసన్నపాలెం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులు కోమటి విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీలో చేరారు. నరసన్నపాలెంకు చెందిన కొప్పుల రాజకుమార్, భూపతి నాగ శ్రీనివాసరావు, గొవ్వాడ రాము, ముత్యాల నాగబాబు, కొప్పుల అరుణ ప్రసాద్, భూపతి చంద్రబాబు, గంట కిషోర్, అర్జా నాని, కుర్మా ముత్తయ్య, అర్జా లుధియమ్మ, కమ్మకట్ల స్వాతి, కుర్మా మరియమ్మ, అర్జా రాణిలకు ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, సర్పంచుల ఫోరం అధ్యక్షులు శీలం రామకృష్ణ, బత్తిన కిషోర్ పాల్గొన్నారు.

● గడపగడపకు సంక్షేమం



కాళ్ల : మండలంలోని ఏలూరుపాడు గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో కెమికల్ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్న ఆరుగురు విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లభించాయి. ఇటీవల క్యాంపస్‌లో హైదరాబాద్‌కు చెందిన డెక్కన్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో భావన, సుబ్రహ్మణ్యేశ్వరరావు, రోహిణీకుమారి, దుర్గాప్రసాద్, పావని, వెంకటేశ్వరరావు ప్రతిభ కనబరిచి ఉద్యోగాలు సాధించారు. వీరిని కంపెనీ ఏడాదికి రూ.4 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపిక చేసింది. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు శుక్రవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో పీ ప్రదీప్‌కుమార్, డీన్ అకడమిక్ లక్ష్మణరావు, కెమికల్ ఇంజినీరింగ్ హెచ్‌వోడీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఆర్టీసీ బస్సులో మంటలు



నిడదవోలు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఇంజిన్ కింది భాగంలో మంటలు చెలరేగుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగిన ఘటన జంగారెడ్డిగూడెంలో శుక్రవారం జరిగింది. నిడదవోలు డిపోకు చెందిన బస్సు ప్రయాణికులతో జంగారెడ్డిగూడెం బస్టాండ్‌కు వస్తుండగా.. స్థానిక గంగానమ్మ గుడి సెంటర్‌కి చేరుకునే సమయానికి ఈ ఘటన చోటుచేసుకుంది. తొలుత పొగ అలుముకొని, ఆ తర్వాత మంటలు చెలరేగాయి. దీంతో డ్రైవర్, కండక్టర్ వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను అప్రమత్తం చేయడంతో వారు కిందికి దిగిపోయారు. స్థానిక యువకులు సమీపంలోని దుకాణాల్లో ఉన్న ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ (మంటలు ఆర్పే పరికరాలు)లు తీసుకువచ్చి మంటలను అదుపు చేశారు. సమాచారం అందుకున్న ఆర్టీసీ గ్యారేజ్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఇంజన్ వద్ద ఉన్న విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌కావడంతో మంటలు చెలరేగినట్లు తెలిపారు. ప్రధాన కూడలి కావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఎస్సై మల్లికార్జున రెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి అపాయం చోటుచేసుకోకపోవడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ధాన్యం కొనుగోళ్లకు సిద్ధంగా ఉండాలి

జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి

భీమవరం(ప్రకాశం చౌక్): ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన గోనె సంచులను సకాలంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ప్రొక్యూర్‌మెంట్, మూడవ దశ రీ సర్వే స్టోన్ ప్లాంటేషన్, రీ సర్వేలోని మ్యూటేషన్ తిరస్కరణ, ఇనాం భూములు, అసైన్డ్ భూములు, సివిల్ సప్లై, అడంగల్ కరెక్షన్, జగనన్న కాలనీలు గృహ నిర్మాణాలు, స్థలసేకరణ, టూరిజం ప్రాజెక్ట్, స్పందన గ్రీవెన్స్ నీటి బిల్లు, సీసీఆర్సీ కార్డులు, ఓటీఎస్ రిజిస్ట్రేషన్, పీఎం కిసాన్, తదితర అంశాలపై మండలాల వారీగా సంబంధిత డివిజన్, మండల స్థాయి అధికారులతో జాయింటు కలెక్టరు సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లకు ఆర్‌బీకేలో పూర్తిస్థాయిలో ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. అవగాహన కొరవడితే ధాన్యం కొనుగోలులో ఇబ్బంది తలెత్తుతాయని ఇప్పటికే డివిజన్, మండలాలు వారిగా అధికారులకు, కస్టోడియన్ అధికారులు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది, టెక్నికల్ సిబ్బంది, హెల్పర్లకు శిక్షణ, గాహన కల్పించామన్నారు. తేమ శాతం, టోకెన్ల జారీ, నాణ్యతా ప్రమాణాలు తదితర వాటిపై సిబ్బందితో ప్రాక్టికల్ గా చేయించామన్నారు. రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా స్నేహపూరిత వాతావరణంలో అధికారులు, సిబ్బంది పనిచేయాలన్నారు. రైతులు పంట కోసే మూడు రోజుల ముందు వారికి కావలసిన గోనె సంచులు అందజేయాలన్నారు. గోనె సంచుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సారి ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా పని చేయాలని సూచించారు. ఆర్డీవోలు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించి రీసర్వే పనులు వేగవంతంగా జరిపించాలన్నారు. రీ సర్వేలో వ్యవసాయ భూములు, గ్రామకంఠం సర్వే సకాలంలో పూర్తిచేసి మెరుగైన ఫలితాలు తీసుకురావాలన్నారు. రైతులకు నోటీసులను సకాలంలో అందజేయకపోతే సదరు ఉద్యోగిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని జాయింటు కలెక్టరు హెచ్చరించారు. ప్రభుత్వ స్థలం ఎక్కడ వదలకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రైవేట్ స్థలాలు సర్వే అనంతరం యజమానులకు యాజమాన్య హక్కు పత్రాలు సకాలంలో అందజేయాలన్నారు. స్పందన గ్రీవెన్స్ పరిష్కారంలో అధికారులు శ్రద్ధవహించి పూర్తి పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ట్రైనీ డిప్యూటీ కలెక్టరు కానాల సంగీత్ మాధుర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజరు టి.శివరామ ప్రసాదు, డీఎస్‌ఓ ఎన్.సరోజ, జిల్లా సర్వే అధికారి కె జాషువా, డీపీఓ జీవీకె మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు దళితులు రుణపడి ఉంటారు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ

భీమవరం (ప్రకాశం చౌక్) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దళితులు రుణపడి ఉంటారని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు తెన్నేటి కిషోర్ మాదిగ అన్నారు. భీమవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఆంధ్రప్రదేశ్‌కు మణిహారమైన విజయవాడ పట్టణంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని నెలకొల్పడం దళితుల గౌరవం పెంచడమేనన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి దళితులను మోసం చేస్తున్నారంటూ మొసలి కన్నీరు కారుస్తున్న ప్రతిపక్షాలు అంబేద్కర్ విగ్రహాన్ని చూసేసరికి వణికిపోతున్నారన్నారు. అంబేద్కర్‌ను గౌరవిస్తే యావత్తు దళిత సమాజానికే గౌరవం ఇచ్చినట్లని.. ఈ విషయం ప్రతిపక్ష నాయకులకు తెలియక పత్రికాలు తీసివేసినట్లు దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఒక పక్క దళితులకు సంక్షేమం అందిస్తూనే మరో పక్క అంబేద్కర్‌ను గౌరవిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దళితులకు అండగా ఉంటారన్నారు. రాబోయే రోజుల్లో అంబేద్కర్ విగ్రహాన్ని వైభవంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించబోతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పశ్చిమగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు పొన్నమండ బాలకృష్ణ, ముస్కుడి రాము తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దేవస్థానంలో మొబైల్ జనరేటర్

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానానికి నూతనంగా కొనుగోలు చేసిన మొబైల్ జనరేటర్‌ను ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా జనరేటర్ వద్ద పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ త్రినాధరావు కొబ్బరికాయ కొట్టి జనరేటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో వేండ్ర త్రినాథరావు మాట్లాడుతూ. 62.05 కేవీఏ సామర్థ్యం గల ఈ అశోక్ లైలాండ్ జనరేటర్‌ను రూ.8 లక్షల వ్యయంతో కొనుగోలు చేసినట్టు చెప్పారు. దేవస్థానంలో ఎక్కడైనా విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు, అలాగే బోర్లుకు విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు, స్వామివారి ఉత్సవాలకు, అత్యవసర పరిస్థితుల్లో ఈ మొబైల్ జనరేటర్‌ను వినియోగిస్తామని తెలిపారు. దేవస్థానంలో జనరేటర్ అవసరం నేపథ్యంలో దీనిని కొనుగోలు చేసినట్లు చెప్పారు.

దుర్గమ్మ దర్శనానికి ప్రత్యేక బస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): శ్రీదేవి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసిన శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనం నిమిత్తం భక్తుల కోసం ఏలూరు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు ఈ నెల 21 నుంచి ఏలూరు జిల్లా పరిధిలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోల నుంచి బయలుదేరుతాయన్నారు. దసరా ఉత్సవాల ముగింపును పురస్కరించుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యే ప్రయాణికుల కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రత్యేక బస్సు సర్వీసుల్లో టికెట్లు పొందడానికి ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఇప్పటికే ప్రారంభించామన్నారు. ఈ ప్రత్యేక సర్వీసులకు ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడంలేదని వివరించారు. ఈ నెల 26న పౌర్ణమి పర్వదినం సందర్భంగా అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం తిరువన్నామలైకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేశామన్నారు. గ్రహణ సమయమైనా గిరిప్రదక్షిణ చేయవచ్చని పైగా గ్రహణ సమయంలో గిరి ప్రదక్షిణ చేయడం చాలా విశేషమని తెలిపారు.

గంజాయి స్వాధీనం



నూజివీడు మండలం గొల్లపల్లిలో గంజాయి తరలిస్తున్న యువకుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

నూజివీడు : గంజాయి కలిగి ఉన్న యువకుడిని అరెస్టు చేసి అతని నుంచి 1585 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని గొల్లపల్లికి చెందిన బత్తుల ఉదయ్‌కిరణ్(20)ను శుక్రవారం అదుపులోకి తీసుకొని అతని నుంచి 1585 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అతను తనకు తెలిసిన వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. అతనిని విచారించగా మూడేళ్ల క్రితం నూజివీడులోని ప్రైవేటు కళాశాలలో బీకాం కంప్యూటర్స్‌లో చేరి గంజాయికి అలవాటు పడి ప్రథమ సంవత్సరంలోనే చదువు మానేశాడని వివరించారు. గంజాయి తాగేందుకు డబ్బులు కోసం తరచూ తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు చెప్పారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

టూటౌన్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ఏలూరు టౌన్: క్రికెట్ బెట్టింగ్ బుకీలను ఏలూరు టూటౌన్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. ఈ బెట్టింగ్ నిర్వహణకు సంబంధించి టూటౌన్ పోలీస్ సిబ్బందిపై పలు ఆరోపణలు వచ్చాయి. బెట్టింగ్ నిర్వాహకులే ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఏలూరు టూటౌన్ కానిస్టేబుల్ సీతయ్యను సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆదేశాలు జారీ చేశారు. ఈ అభియోగాలపై విచారణ చేపడుతున్నామని పోలీస్ అధికారులు తెలిపారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఓ భక్తుడు శుక్రవారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. కాకినాడకు చెందిన పీఎంజీకే వర్మ ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ కార్యాలయంలో విరాళాన్ని జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

సురక్షతో ఖర్చు లేకుండా వైద్యం



తాడేపల్లిగూడెం రూరల్: ఎల్.అగ్రహారంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు



తాడేపల్లిగూడెం రూరల్: రోగుల వివరాలు నమోదు చేస్తున్న దృశ్యం

- తాడేపల్లిగూడెం డివిజన్లలో పలు చోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు
- వేలాది పేదలకు ఉచితంగా వైద్యం

తాడేపల్లిగూడెం రూరల్: రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల లక్ష్యమని జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్.అగ్రహారం సచివాలయ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జెడ్పీటీసీ ఆంజనేయులు మాట్లాడుతూ ఇంటి ముంగిటే మహిళలు, వృద్ధులకు వైద్యం అందించడం ద్వారా వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ఏర్పాటు చేస్తున్న ఈ వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రతి ఇంటికీ వైద్యం తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అనంతరం వైద్యులు రూపాదేవి, ఏపీ.వెంకటేష్, ఆర్.స్నేహిత, శ్వేతశ్రీలు 770మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, సచివాలయ కార్యదర్శి బి.శ్రీరామ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సొసైటీ డైరెక్టర్ నీలపాల రామన్న, కొత్తపల్లి ప్రసాద్, శీలంశెట్టి బాలాజీ, దంగేటి నారాయణరావు, చామంతి మల్లిఖార్జునరావు, హెల్త్ విజిటర్, సీహెచ్‌జే.వేదమణి,సీహెచ్‌వోలు డి.ఇందిర ప్రియాంక, కే.సూర్యకాంతం, జి.శరత్, సీహెచ్.సందీప్ రాజ్, పి.నవ్యలక్ష్మి, టి.సోని, బి.విజయలక్ష్మి, జి.దివ్య, కే.శ్రావ్య, డి.సత్తిబాబు, ఆర్.రాధాకృష్ణ, కేవీ.రత్నాజీ, గ్రామ ఆరోగ్య సహాయకులు ఎస్.గంగాదేవి, టి.సోమన్న, కే.రాణి, ఎస్.ఆదిలక్ష్మి, ఎంపీహెచ్ఏ ఎండి.రోషనీ బేగం, ఆశా కార్యకర్తలు పి.సత్యవతి, జి.పద్మ, ఎం.సుధ, జి.వసంతకుమారి, ఎం.భూలక్ష్మి, డి.మణిమాల, జే.రోహేలు, సీహెచ్.సాహితి, ఫార్మాసిస్ట్ వివి.రామారావు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న తెన్నేటి జగ్జీవన్



అత్తిలి: కొమ్మరలో జగనన్న ఆరోగ్యసురక్షలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

అత్తిలి: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు.ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతీ ఒక్కరికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలన్న లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పైబోయిన మాట్లాడుతూ ఒక్క రూపాయి ఖర్చులేకుండా పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందిస్తున్నారని, ఈఅవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజల యోగక్షేమాలు, ఆరోగ్యం, సంక్షేమం, అభివృద్ధి, విద్య గురించి నిరంతరం ఆలోచించే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని పేర్కొన్నారు. రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణి ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, సర్పంచ్ మంతెన రామసీత, ఉపసర్పంచ్ మన్యం దానారావు, వైస్ ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షులు కునాధరాజు శ్రీహరిరాజు, వెలగల సుదర్శనరెడ్డి, ఎంపీడీవో ఎండీ అమీలుజమా, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో కార్పొరేట్ వైద్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా గ్రామాల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు తెన్నేటి జగ్జీవన్ చెప్పారు. పట్టణంలో శుక్రవారం శివాలయం వీధిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. ఈ సందర్భంగా తెన్నేటి జగ్జీవన్ మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యవంతంగా జీవించాలని లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నారన్నారు. ప్రజల సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, నియోజకవర్గ ప్రజల కోసం సంక్షమమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణకు ప్రజల మద్దతు, అశీస్సులు ఎప్పుడు ఉంటాయన్నారు.ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. మునిసిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు, నోడల్ ఆఫీసర్ రవికుమార్, ఏఎస్ఓ సురేష్, వైద్య బృందం, సచివాలయం కన్వీనర్ ధర్నాల శేఖర్, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పర్యవేక్షించారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం



గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దసరా సెలవులు సందర్భంగా ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణా శిబిరంలో శుక్రవారం పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు విశ్రాంత ఉద్యోగి లక్ష్మణరావు, హైదరాబాద్‌కు చెందిన కేవీ సత్యప్రకాశ్‌లు పుస్తక పఠనం వల్ల ఉపయోగాలు తెలిపారు. అలాగే ఇంగ్లీషు గ్రామర్‌తో పాటు ఇంగ్లీషు పుస్తకాలు చదివించడం, జనరల్ నాలెడ్జి తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ప్రథమ శ్రేణి గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు పర్యవేక్షించారు. విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, చదవరులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ సేవలు అభినందనీయం



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. లయన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు అధ్యక్షతన శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. డైమండ్స్ అధ్యక్షుడు కొప్పిశెట్టి రమణయ్య సహకారంతో ముద్రించిన నోట్ బుక్స్ కిట్‌లను పలువురు విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గట్టిం సరోజని, గమిని సుబ్బారావు, భవాని, కె.వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి, భారతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మానవత విజయీభవ కరపత్రం విడుదల



మానవత కరపత్రం ఆవిష్కరిస్తున్న డిఈఓ వెంకటరమణ, తదితరులు

పెంటపాడు: మానవత ద్వారానే ఉత్తమ సమాజ స్థాపన సాధ్యపడుతుందని మానవత జిల్లా అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు పేర్కొన్నారు. విద్యార్థుల కోసం మానవత సంస్థ రూపొందించిన రూపొందించిన మానవత విజయీభవ కరపత్రాన్ని డీఈఓ ఆర్ వెంకటరమణ శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మనవత సేవలను కొనియాడారు. మానవత ద్వారానే రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు రూపొందించడం అభినందనీయమన్నారు.

లేగ దూడలను సంరక్షించాలి



బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఆకివీడు: లేగ దూడల సంరక్షణతోనే పశువులు వృద్ధి చెందుతాయని మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య అన్నారు. ఆకివీడు మండలం కుప్పనపూడి గ్రామంలో పశుసంవర్థక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో 50కి పైగా లేగదూడల్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో సీతారామయ్య మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టిందని వివరించారు. డీడీ డాక్టర్ జవహర్ హుస్సేన్ మాట్లాడుతూ లేగదూడల వృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. ఆడ దూడ పుట్టే విధంగా స్పెర్మ్ అందుబాటులో ఉందని చెప్పారు. డివిజన్‌కు 800 లేగ దూడలు పుట్టే విధంగా స్పెర్మ్ అందుబాటులో ఉంచామని చెప్పారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ అధికారి జేసురత్నం పశువు ఈనిన తరువాత జున్ను పాలను దూడకే అధిక శాతం వదిలివేయాలని సూచించారు. జున్నుపాలులో పోషకాలు అధికంగా ఉండటం వల్ల దూడ ఆరోగ్యకరంగా ఉంటుందని చెప్పారు. సర్పంచ్ ముత్యాల అనురాధ, ఏడీఏ జనార్దన్, మండల పశువైద్యాధికారి కెల్లా భార్గవి సత్య, ఆర్బీకే చైర్మన్ కృష్ణమాచార్యులు, నంద్యాల చల్లారావు పాల్గొన్నారు.

డీఎన్నార్ పీజీ పరీక్షా ఫలితాల విడుదల

సాక్షి, భీమవరం: డీఎన్నార్ కళాశాల పీజీ కోర్సెస్ 2, 4 సెమిస్టర్ ఫలితాలను శుక్రవారం కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు, అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు విడుదల చేశారు. పరీక్షలకు 376 మంది హాజరు కాగా 308 మంది ఉత్తీర్ణత(82 శాతం) సాధించి తమ పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌జే సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఇరగవరంలో మండల సర్వసభ్య సమావేశం



ఇరగవరం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఇగవరం: మండలంలోని ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామని ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగతాయారు అన్నారు. శుక్రవారం ఇరగవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సహకారంతో ఇగవరం మండలం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున సంక్షేమ, అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా వంటీర్లు ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందించడం జరుగుతుందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో పరిపాలన సులభతరమైందని పేర్కొన్నారు. అధికారులు, నాయకలు సమన్వయంతో పని చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. అనంతరం శాఖల వారిగా అధికారులు మండలంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. రైతులకు వలంటీర్లు, సచివాలయ వ్యవసాయ అధికారులు సహకరించడం లేదని ఇగవరం సొసైటీ అధ్యక్షుడు చవ్వాకుల శ్రీనివాస్ అధికారులను ప్రశ్నించారు. ఎంఎవో స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామాల్లో నిర్మిస్తున్న సచివాలయల నిర్మాణాలు పూర్తి చేసేందుకు సహకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ అధ్యక్షుడు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

26న వాహనాలకు బహిరంగ వేలం

తణుకు: తణుకు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మోటారుసైకిళ్లకు ఈనెల 26న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తణుకు రూరల్ పోలీసులు తెలిపారు. సంబంధిత మోటారు సైకిళ్ల యజమానులు వాటిని తీసికెళ్లేందుకు ముందుకు రాకపోవడంతో వాటిని ఈనెల 26న ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనేవారు ముందుగా పోలీసు స్టేషన్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

● దుర్గమ్మ.. పాహిమాం



తణుకు అర్బన్: సరస్వతీ దేవి అవతారంలో నాగమ్మ తల్లి



తాడేపల్లిగూడెం రూరల్: ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారిని సరస్వతీదేవిగా అలంకరించిన దృశ్యం



అత్తిలి: సరస్వతీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రం ఆవరణలో సరస్వతీ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో అధ్యాత్మిక శోభ నెలకొంది. పలు ఆలయాల్లో దుర్గాదేవిని శుక్రవారం సరస్వతి దేవిగా ఆలకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో విశేషంగా కుంకుమ పూజలు నిర్వహించారు. మండపాల్లో భవానీ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- సాక్షి,నెట్ వర్కు



తాడేపల్లిగూడెం(టీఓసీ) సరస్వతిదేవిగా శ్రీవాసవి అమ్మవారు



తణుకు టౌన్: దువ్వ దానేశ్వరి ఆలయం ఆవరణలో సరస్వతీ దేవీ పూజలో పాల్గొన్న చిన్నారులు



పెంటపాడు: పరిమెళ్ల గ్రామంలో సరస్వతీ దేవి అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

స్వాతంత్ర్య సమర యోధులను గుర్తించుకోవాలి

తణుకు టౌన్: స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలనే తలంపుతో భారత ప్రభుత్వం చేపట్టిన అమృత కలష్ యాత్రను నిర్వహిస్తున్నామని మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు చెప్పారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నాదేశం, నాభూమి కార్యక్రమంలో బాగంగా శుక్రవారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రామంలో నిర్వహించిన అమృత్ కలశ యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల్లో స్వాతంత్ర స్ఫూర్తిని నింపేందుకు భారత ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమం చేయడం ఎంతో సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథం కృష్ణవేణి, ఎంపీడీవో కే కిరణ్‌కుమార్, గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు నున్న దుర్గ ప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, ఈవోపీఆర్డీ, గ్రామ కార్యదర్శి వీ గంగాధరరావు, నెహ్రూ యువ కేంద్రం వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

16న సువార్తికుల సదస్సు



ప్రార్థనలు చేస్తున్న సువార్తికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ క్రిస్టియన్ థియాలజీ కళాశాలలో నవంబర్ 16వ తేదీన గురువారం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు క్రీస్తు సంఘం సువార్తికుల సదస్సు జరుగుతుందని, క్రీస్తు సువార్తికులు పాల్గొనాలని బైబిల్ కళాశాల డైరెక్టర్ రొక్కాల నాగబుజ్జి, ఎం.డేవిడ్, ఫిలిప్ జాన్, సత్యానందంలు వెల్లడించారు. నాగబుజ్జి మాట్లాడుతూ బిక్కవోలు బైబిల్ కళాశాల డైరెక్టర్ జాన్‌డీన్, వంశీ భూషణ్ పాల్గొని దేవుని వాక్యాన్ని ప్రకటిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, గోసాల చిట్టిబాబు, రమేష్, రాజేష్, సురేష్, మధు, రాజేంద్రలు పాల్గొని మత ప్రార్థనలు చేశారు.

దేశంలో నిరుద్యోగాన్ని పెంచుతున్నారు..

సాక్షి, భీమవరం: కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు మంచి రోజులు వస్తాయని ఊదరగొట్టి ప్రభుత్వరంగ సంస్థలన్నింటిని ప్రైవేటు పరం చేసి నిరుద్యోగాన్ని పెంచిపోషిస్తున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుండా, విశాఖ ఉక్కు, రైల్వేజోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను గాలికి వదిలేసి రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కార్యదర్శి బి.బలరాం, జిల్లా సెక్రటేరియట్ సభ్యుడు కవురు పెద్దిరాజు, జేఎన్వీ గోపాలన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నిర్లక్ష్యం తగదు

ఆకివీడు: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై నిర్లక్ష్యం తగదని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ అన్నారు. స్థానిక సబ్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం వినియోగదారుల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. విద్యుత్ వినియోగంలో వచ్చే సమస్యలు, బిల్లులు, ఇతర సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని ఆయన అన్నారు. వినియోగదారులు తమ సమస్యలు పరిష్కారం కాకపోతే విశాఖ పట్టణంలోని పరిష్కార న్యాయస్థానానికి ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యుత్ నియంత్రణ మండలి నియమావళి ప్రకారం నిర్ణీత కాలపరిమితిలో పరిష్కరించాలని అన్నారు. వినియోగదారులు తమ సమస్యల్ని రెండేళ్లలోపు సంస్థకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ఏడాదిలో సంస్థకు 359 ఫిర్యాదులు రాగా, ఇందులో 352 పరిష్కరించామని చెప్పారు. 2016 నుంచి ఇప్పటి వరకు 2,423 కేసులు పరిష్కరించినట్లు సత్యనారాయణ వివరించారు. తొలుత వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు విద్యుత్ వినియోగం, సమస్యలు, పరిష్కారం వంటివాటిపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఎస్.హరిబాబు, ఝాన్సీ, ఏపీఈపీడీసీఎల్ ఈఈ పీర్ అహ్మద్ ఖాన్, ఏడీఏ శ్రీనివాసరావు, ఏఈలు ప్రదీప్, ప్రసాదరాజు, పి.శ్రీనివాసరావు, ఎల్ఐ ఆంజనేయరాజు, విద్యుత్ శాఖసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో ముగిసిన హ్యాకథాన్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో 24 గంటల పాటు జరిగిన హ్యాకథాన్ లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఎం.అలోక్య, ఎల్.సాయి నేహ, పి.జ్యోతింద్రలకు ప్రథమ బహుమతితో పాటు రూ.10వేలు నగదు బహుమతిని గెలుచుకున్నారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు తెలిపారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ సెల్, కోడింగ్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హ్యాక్ ఓవర్ 2కె 23 పేరిట 24 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయం కళాశాల ఆడిటోరియంలో జరిగిన బహుమతులను అందించారు. సీఎస్సీ హెడ్ డాక్టర్ వి.చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు పాల్గొన్నారు.